# తెలంగాణ గుండెచప్పుడు సింగరేణి

- ఆరు జిల్లాల్లో విస్తరణ
- 39,991 మంది కార్మికులు
- రాష్ట్ర సాధన ఉద్యమంలో నల్ల సూర్యుల పాత్ర కీలకం
- కారుణ్య నియామకాలతో బీఆర్ఎస్‌పై పెరిగిన క్రేజ్
- ఉద్యోగాల్లో 12వేల మంది కార్మికుల పిల్లలు
- సీఎం కేసీఆర్ చొరవతో సమస్యల పరిష్కారం



జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ) : స్వరాష్ట్రంలో సింగరేణి సంస్థ రాష్ట్రానికి ఒక గుండె లాంటింది. తెలంగాణలో అతి పెద్ద సంస్థ అయిన సింగరేణి కాలరీస్ కంపెనీని కాపాడుకోవడానికి సీఎం కేసీఆర్ ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగారు. ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న సంస్థ మనుగడకు ఆయన వెన్నుదన్నుగా నిలిచారు. సమైక్య పాలనలో ఆగమైన సింగరేణికి జవసత్వాలు నింపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండి గోల్డెన్ షేక్ హ్యాండ్ పథకాన్ని ప్రవేశపెట్టి పెద్ద ఎత్తున కార్మికులను ఇంటికి సాగనంపింది. మరో వైపు ఓ జాతీయ పార్టీ అనుబంధ సంఘం సింగరేణిలో అనాధిగా వస్తున్న వారసత్వపు ఉద్యోగాలకు చరమగీతం పాడింది. ఎన్నికల సమయంలో కేసీఆర్ ఇచ్చిన హామీలను తూ.చా తప్పకుండా అమలు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వారసత్వ ఉద్యోగాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చి ఎన్ని అవరోధాలు ఎదురైనా ఇచ్చిన మాట ప్రకారం కారుణ్య నియామకాల పేరుతో వారసత్వపు ఉద్యోగాలను సాధించారు. ప్రస్తుతం సింగరేణి వ్యాప్తంగా కారుణ్య నియామకాలతో 12వేల మంది కార్మికుల పిల్లలు ఉద్యోగాలు చేస్తున్నారు. దీంతో కార్మికుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. సీఎం కేసీఆర్ కారుణ్య నియామకాలను తిరిగి తీసుకురావడంతో బీఆర్ఎస్‌పై కార్మికుల్లో క్రేజ్ పెరిగింది. సింగరేణి వ్యాప్తంగా కార్మికులు బీఆర్ఎస్ వైపు మొగ్గ చూపుతున్నారు. కారుణ్య నియామకాలే కాకుండా బీఆర్ఎస్ అనుబంధ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) అనేక హక్కులను సాధించిపెట్టింది.

**ఆరు జిల్లాల్లో 39,991 మంది కార్మికులు**

తెలంగాణలో సింగరేణి సంస్థ విస్తరించి ఉన్న ఆరు జిల్లాల్లో 11 డివిజన్లలో 39,991 మంది కార్మికులు పనిచేస్తున్నారు. బెల్లంపల్లి డివిజన్‌లో 985 మంది, మందమర్రి 4,876 మంది, శ్రీరాంపూర్ 9,123 మంది, కార్పొరేట్‌లో 1,204 మంది, కొత్తగూడెం 2,370 మంది, ఇల్లందు 601 మంది, మణుగూరు 2,417 మంది, రామగుండం-1లో 5,424మంది, రామగుండం-2లో 3,479 మంది, రామగుండం-3లో 3,943 మంది, భూపాలపల్లి డివిజన్‌లో 5,349 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో సుమారు రెండు లక్షల మంది కార్మిక కుటుంబాలు ఓటు హక్కును వినియోగించుకోనున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధనలో జరిగిన ఉద్యమంలో ముందున్న నల్ల సూర్యులు సింగరేణి సంస్థ మణుగడకు కృషి చేస్తున్న కేసీఆర్ వైపు నిలిచారు. కేవలం వారసత్వపు ఉద్యోగాలను పునరుద్ధరించడం ఒక చారిత్రాత్మకమైంది.

## సాధించిన హక్కులు

- జాతీయ కార్మిక సంఘం కాలరాసిన వారసత్వపు ఉద్యోగాల హక్కును తిరిగి తీసుకవచ్చి 12వేల మంది కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వడం.
- కార్మికుల తల్లిదండ్రులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం.
- జాతీయ కార్మిక సంఘాల వైఫల్యంతో నిలిచిపోయిన 3,400 పెండింగ్ ఉద్యోగాలు డిపెండెంట్లకు ఇప్పించడం.
- అంబేద్కర్ జయంతి, సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్‌కు అదనపు పీహెచ్‌డీలు.
- రూ.10లక్షల ఇంటి రుణానికి వడ్డీ తిరిగి చెల్లించడం.
- బేసిక్‌పై ఒక శాతం విద్యుత్ చార్జీలు రద్దు. ఏసీ పెట్టుకోవడానికి అనుమతి. ఉచిత విద్యుత్.
- గని ప్రమాదంలో మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.20లక్షల మ్యాచింగ్ గ్రాంట్.
- డ్యూటీలో ఉండి సహజ మరణం పొందిన కార్మిక కుటుంబానికి రూ.15లక్షల మ్యాచింగ్ గ్రాంట్.
- తెలంగాణ ఇంక్రిమెంట్, అండర్‌గ్రౌండ్ కార్మికులకు యూనిఫాం.
- లాభాల వాటా 16శాతం నుంచి 32 శాతానికి పెంపు.
- కోలిండియాలో లేని విధంగా సింగరేణిలో మహిళలకు డిపెండెంట్ ఉద్యోగాల్లో అవకాశం.
- ఉద్యోగం వద్దు అనుకునే డిపెండెంట్లకు కోలిండియా కన్నా భిన్నంగా రూ.25లక్షలు చెల్లింపు.
- 190/240 మస్టర్లు నిండిన సంవత్సరం లోపే బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరణ.
- ఐఐటీ, ఐఐఎంల్లో సీటు సాధించిన కార్మికుడి పిల్లలకు ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పించడం.
- సింగరేణి కార్మికుల ఆరోగ్యం, పిల్లల భవిష్యత్తు కోసం రామగుండంలో సింగరేణి మెడికల్ కళాశాల ఏర్పాటు. కార్మికుల పిల్లలకు ఐదు శాతం రిజర్వేషన్.
- సూపర్‌వైజర్ సిబ్బందికి 50శాతం బంగ్లా అలవెన్స్ పెంపు.
- సింగరేణి ఏరియా ఆస్పత్రి, కొత్తగూడెం కార్పొరేట్ ఆస్పత్రిలో సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్‌లను ఏర్పాటు చేయడం.
- మహిళా కార్మికులకు చైల్డ్‌కేర్ లీవ్ రెండు సంవత్సరాలు ఇప్పించడం.
- గతంలో కంటే భిన్నంగా పెళ్లి అయినా, విడాకులు అయినా, వితంతువు, ఒంటరి మహిళ కూతురు, వితంతు కోడలకు కూడా డిపెండెంట్‌గా అవకాశం.
- వికలాంగులకు సర్ఫేస్‌లో ఉద్యోగం.
- కేసీఆర్ ఆదేశాలతో సింగరేణి సంస్థలో ఇక ముందు డబుల్ బెడ్‌రూం క్వార్టర్లు నిర్మించాలని నిర్ణయం. ఇందులో భాగంగా భూపాలపల్లిలో 994, సత్తుపల్లిలో 440 క్వార్టర్ల నిర్మాణం.
- వివిధ ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ల ద్వారా 3800లకు పైగా నూతన ఉద్యోగాలు.
- సింగరేణి వ్యాప్తంగా ఏసీ ఫంక్షన్ హాళ్లు.
- 600 మంది డిస్మిస్ కార్మికులకు తిరిగి ఉద్యోగాలు.
- వృత్తి పన్ను శాశ్వతంగా రద్దు.
- స్పోర్ట్స్ లీవ్‌లను ఓడీగా మార్చి మస్టర్ కింద గుర్తించడం.
- సకల జనుల సమ్మె కాలపు వేతనం చెల్లించడం.
- సొంత ఇళ్లలో ఉండే కార్మికులకు 100 యూనిట్ల విద్యుత్ చార్జీల చెల్లింపు.

## కౌంటింగ్ సిబ్బంది, అధికారులు
# అప్రమత్తంగా ఉండాలి
### : కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్,నవంబర్ 26 : ఎన్నికల్లో భాగంగా ఈ నెల 30న పోలింగ్ అనంతరం డిసెంబర్ 3వ తేదీన చేపట్టనున్న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణలో కౌంటింగ్ సూపర్ వైజర్లు,సూక్ష్మపరిశీలకులు, సహాయకులు విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఆదివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో బెల్లంపల్లి రిటర్నింగ్ అధికారి , అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ , మంచిర్యాల రిటర్నింగ్ అధికారి రాములు, చెన్నూరు రిటర్నింగ్ అధికారి సిడాం దత్తు, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు రమేశ్,లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతితో కలిసి కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సూక్ష్మపరిశీలకులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబరు 2న నిర్వహించనున్న రెండో విడుత శిక్షణ కార్యక్రమంలో కౌంటింగ్ సంబంధిత అంశాలను పూర్తిగా నేర్చుకోవాలని,కౌంటింగ్ కేంద్రంలో లెక్కింపు విధానం ,టేబుళ్లు ఇతర ఏర్పాట్లపై శిక్షణ అనంతరం అదే రోజున గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. రాజకీయపార్టీల ఏజెంట్లకు కనిపించే విధంగా పూర్తి పారదర్శకంగా లెక్కింపు ప్రక్రియ చేపట్టాలన్నారు. ఈవీఎంల నిర్వహణలో సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించాలని తెలిపారు.


## ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

సీసీసీ నస్పూర్, నవంబర్ 26: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీరాంపూర్ 140/2018 ఆధ్వర్యంలో నస్పూర్‌కాలనీలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడపాక లక్ష్మణ్, నక్క సుమన్, గోదారి మురళీ, అందె వెంకటేష్, ఎర్రోళ్ల శంకర్, నర్సింగరావు, శెట్టి శంకరయ్య, వేల్పుల ప్రవీణ్, సంకె సతీష్, సుందిల్ల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

**లక్షెట్టిపేటలో..**

లక్షెట్టిపేట, నవంబర్ 26: పట్టణంలోని అంబేత్కర్ విజ్ఞాన మందిరంలో ఆదివారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ముల్కల్ల రాందాస్, రాష్ట్ర నాయకులు దమ్మ నారాయణ, జిల్లా నాయకులు శనిగారపు లింగన్న పాల్గొన్నారు.

# నేడు కార్తీక పౌర్ణమి



- జాతరకు ముస్తాబైన గూడెం గుట్ట

దండేపల్లి, నవంబర్26: నేడు కార్తీక పౌర్ణమి సందర్భంగా నదీ స్నానాలు, దీపారాధానలు, తులసి, దైవపూజలకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. కార్తీకపౌర్ణమి రోజు ఉదయాన్నే ఉసిరికాయ స్నానం ఆచరించి తులసికోట దగ్గర కార్తీక దీపం వెలిగించడం ఆనాదిగా వస్తున్న సంప్రదాయం. సాయంత్రం ఇళ్ల ముంగిళ్లలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించగా, పిల్లలు బాణాసంచా కాల్చి వేడుకలు నిర్వహిస్తారు.

**ముస్తాబైన ఆలయాలు..**

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గూడెం శ్రీసత్య నారాయణస్వామి ఆలయం ముస్తాబైంది. ఆలయాన్నీ రంగు రంగుల విద్యూత్ దీపాలతో అలంకరించారు. సుమారు 60-80 వేల మంది భక్తులు వస్తున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికోసం సుమారు 40వేలకు పైగా లడ్డూలు, 25వేల పులిహోరా ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. షామియానాలు, తాత్కాలిక వ్రత మండపాలను సిద్ధం చేశారు. గోదావరిలో లోతైన ప్రదేశాలకు వెల్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాట్లు చేస్తున్నారు.మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లు నిర్మించామని, దర్శనానికి ఘాట్ రోడ్డు గుండా భారీకేడ్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

**మార్కెట్‌లో కార్తీక పౌర్ణమి సందడి**

మంచిర్యాల ఏసీసీ, నవంబర్ 26 : కార్తీక పౌర్ణమి వేడుకలను ఆలయాలను ముస్తాబు చేశారు. నేడు ఉదయం భక్తులకు ఆలయానికి చేరుకుని వత్తులు, ఉసిరక దీపాలు వెలిగించనున్నారు. ఆదివారం మార్కెట్‌లో ఉసిరికాయలు, గుమ్మడికాయలు, సాంబ్రాణి, ప్రతిమలు, వత్తులను కొనుగోలు చేసువారితో సందడిగా మారింది.

## సింగరేణి స్థలాల్లో నివాసులకు
# పట్టాలిచ్చిన ఘనత బీఆర్ఎస్‌దే..

బెల్లంపల్లి, నవంబర్ 26: సింగరేణి స్థలాల్లో నివాసముంటున్న వారికి పట్టాలిచ్చిన ఘనత బీఆర్ఎస్‌దేనని, బెల్లంపల్లిలోని స్టేషన్‌రోడ్డు కాలనీలోని సింగరేణి క్వార్టర్లకు పట్టాలు పంపిణీ చేస్తామని పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని పేర్కొన్నారు. శాంతిఖని గని పిట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్ ఆధ్యక్షతన ఆదివారం రాత్రి కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల అనంతరం సీఎండీతో ప్రత్యేకంగా మాట్లాడి పట్టాల పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుడుతామని హామీ ఇచ్చారు. ఇప్పటికే బెల్లంపల్లి పట్టణంలో సీఎం కేసీఆర్ సహకారంతో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఏడు వేలకు పైగా పట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు. స్టేషన్‌రోడ్డు కాలనీలో కూడా తప్పకుండా పట్టాలు అందిస్తామని వెల్లడించారు. కాంగ్రెస్, సీపీఐ అనుబంధ సింగరేణి గుర్తింపు సంఘాలు కార్మికులకు ఉన్న హక్కులు పోగొట్టాయే తప్పా కొత్తగా ఏమీ సాధించలేదని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచే సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారని వెల్లడించారు. అప్పటి సంఘాలు పోగొట్టిన డిపెండెంట్ ఉద్యోగాలను తిరిగి కారుణ్య నియామకాలతో తీసుకువచ్చిన ఘనత కేవలం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇప్పటి వరకు కాపాడుకున్న సింగరేణి ఇక ముందు కూడా ఇలాగే సాగాలంటే మరోసారి సీఎంగా కేసీఆరే ఉండాలన్నారు. సింగరేణిలో బొగ్గు బ్లాక్‌లను ఇటీవల బీజేపీ ప్రభుత్వం ప్రయివేట్‌పరం చేయాలని చూస్తే కేసీఆర్ అడ్డుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో మరే సర్కార్ ఉన్నా సింగరేణి ప్రైవేట్ పరమవుతుందన్నారు.



బెల్లంపల్లి : మాట్లాడుతున్న ఎంపీ వెంకటేశ్ నేతకాని